క్లుప్తంగా

బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా ప్రసాద్



వరప్రసాద్‌కు నియామక పత్రం అందిస్తున్న బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు

రంగంపేట: బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా రంగంపేట మండలం పెదరాయవరం గ్రామానికి చెందిన మద్దిపాటి వీరవరప్రసాద్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ మండల కేంద్రమైన రంగంపేటలో ఆదివారం బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి, జిల్లా అధ్యక్షుడు సత్యకుమార్‌ల సమక్షంలో ఉపాధ్యక్షుడిగా ప్రకటించి నియామక పత్రం అందించారన్నారు. వరప్రసాద్ నియామకంపై అనపర్తి నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ ఎంఎస్ఆర్‌కే రాజు, మండల అధ్యక్షుడు సాయిరాం హర్షం వ్యక్తం చేశారు.

78 మందికి కళ్లజోళ్ల పంపిణీ



పందలపాకలో కళ్లజోళ్లు అందిస్తున్న సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి

బిక్కవోలు: మండలంలోని పందలపాక సచివాలయం వద్ద సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి ఆదివారం 78 మంది లబ్ధిదారులకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షలో కంటి పరీక్షలు చేసి అవసరమైనవారికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ పడాల వీర్రాఘవరెడ్డి, వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, ఏఎన్ఎం కె.అనంతలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌వో నవ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు 'స్పందన'

రాజానగరం: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా ప్రతి సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఇన్‌చార్జి ఎం. సుబ్రహ్మణ్యం విజ్ఞప్తి చేశారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

ఎమ్మెల్యేకు కార్మికుల వినతి పత్రం



బిక్కవోలులో ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని కానేడు గ్లూకోజ్ ఫ్యాక్టరీ కార్మికులు ఆదివారం కలిసి వినతిపత్రం అందించారు. కానేడులోని గ్లూకోజ్ ఫ్యాక్టరీ యాజమాన్యం రెండు నెలలుగా ఫ్యాక్టరీ మూసేసి తమను ఇబ్బందులను గురిచేస్తోందని ఎమ్మెల్యే వద్ద తమ గోడు వెల్లబోసుకున్నారు. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న సుమారు 250 మంది కార్మికులను తొలగించే ప్రయత్నాలు యాజమాన్యం చేస్తోందని ఆందోళన వెలిబుచ్చారు. ఫ్యాక్టరీ తెరిపించి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్య పరిష్కారించేందుకు కృషి చేస్తానని కార్మికులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్మిక సంఘ అధ్యక్షుడు ఎ.నాగేశ్వరరావు, కార్యదర్శి వి.రాంబాబు, ఉపాధ్యక్షుడు కె.వెంకటరమణ పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో చురుగ్గా ఇళ్ల నిర్మాణం



జగనన్న కాలనీలో నిర్మిస్తున్న ఇళ్లు

రాజానగరం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు గృహ నిర్మాణ, గ్రామ సచివాలయాల సిబ్బంది కృషి చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలు సమయం సమీపిస్తున్న తరుణంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలనే లక్ష్యంతో స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా కూడా తరచూ గృహ నిర్మాణాలపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలో సుమారు 12,120 మందికి నివాస స్థలాలు పంపిణీ చేయగా వీటిలో రెండు ఫేజ్‌లలో 8 వేల గృహ నిర్మాణాలు చేపట్టారు. ఇప్పటికే సుమారు 3,215 ఇళ్లు పూర్తయ్యాయి.

శరవేగంగా కులగణన

- ఇంటింటికీ వెళ్లి వివరాలు నమోదుచేస్తున్న వలంటీర్లు
- నియోజకవర్గంలో బిక్కవోలు మండలం ముందంజ



పందలపాకలో కులగణన సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది, వలంటీర్

బిక్కవోలు: అట్టడుగు వర్గాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందాలంటే సమగ్ర కులగణన అవసరం. రాజ్యాంగ నిపుణుల సూచనల మేరకు దేశంలోని పలు రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు కులగణన చేస్తామని మాటల్లో చెప్పాయే తప్ప చేతలలో చేయలేకపోయాయి. ప్రజలకు మేలు చేయాలన్న తలంపుతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో కులగణన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అనపర్తి నియోజకవర్గంలో కులగణన ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. వచ్చే నెల 5వ తేదీతో గడువు ముగియనుంది.

తొలి దశలో ఇంటింటి సర్వే ప్రక్రియలో సచివాలయ ఉద్యోగి, గ్రామ వలంటీర్ల భాగస్వామ్యంతో ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నారు. నియోజకవర్గంలోని అనపర్తి మండలంలో కుటుంబాల సర్వే 89.82 శాతం, సభ్యులు 83.74 శాతం పూర్తి కాగా, బిక్కవోలు మండలంలో కుటుంబాల సర్వే 91.64 శాతం, సభ్యులు 84.82 శాతం పూర్తయింది. రంగంపేట మండలంలోనైతే కుటుంబాల సర్వే 89.11 శాతం కుటుంబ సభ్యుల సర్వే 82.87 శాతం వరకూ నమోదుచేశారు. పెదపూడి మండలంలో మాత్రం కుటుంబాల సర్వే 81.66 శాతం, సభ్యుల సర్వే 67.52 శాతం పూర్తయింది. నియోజకవర్గంలోని కులగణన సర్వేలో బిక్కవోలు మండలం ముందంజలో ఉంది.

అనపర్తి నియోజకవర్గంలో కులగణన సర్వే ప్రగతి వివరాలు

మండలం	సచివాలయం	వలంటీర్లు	కుటుంబాలు	సభ్యులు	పూర్తయిన కుటుంబాలు	పూర్తయిన కుటుంబాలు
అనపర్తి	19	480	26,925	69,109	24,158	57,811
బిక్కవోలు	21	447	25,464	67,824	23,317	57,411
రంగంపేట	19	385	21,775	59,600	19,402	49,298
పెదపూడి	20	372	26,640	71,670	21,753	48,390

సామాజిక వర్గాల వారీగా నమోదు



ఇంటింటా ఏ సామాజిక వర్గాలకు చెందినవారు ఎంతెంత మంది ఉన్నారో తెలుసుకునేందుకు కులగణన ప్రక్రియ చేపట్టాం. సచివాలయ సిబ్బంది, వలంటీర్ల భాగస్వామ్యంతో సర్వే నిర్వహిస్తున్నాం. వలంటీర్లు మొబైల్ యాప్ ద్వారా ఈ సర్వే చేస్తున్నారు. సర్వే ఇప్పటికే చివరి దశకు వచ్చింది. సర్వే వేగంగా జరగడానికి ప్రజలు సహకరిస్తున్నారు.

– జేప ఝాన్సీ, ఎంపీడీవో, బిక్కవోలు

సర్వే నిర్వహణ ఇలా

సమగ్ర కులగణన సర్వే పూర్తి పారదర్శకంగా చేస్తున్నారు. కుటుంబ సభ్యులు వెల్లడించిన వివరాలనే సర్వే సిబ్బంది నమోదు చేస్తున్నారు. కులాంతర వివాహాలు చేసుకున్నవారికి ఎవరికులం వారికే నమోదు చేస్తున్నారు. సర్వే సమయంలో కుటుంబ, జిల్లా, మండలం, గ్రామం వివరాలతో పాటు ఆయా కుటుంబ సభ్యులందరూ ఉన్నారా, ఎవరైనా మృతి చెందారా, లేక శాశ్వతంగా వలస వెళ్లారా అన్న విషయాలు సేకరిస్తున్నారు. కుటుంబంలో ప్రతి వ్యక్తి పేరు, వయసు, లింగం, భూమి(వ్యవసాయ –వ్యయసాయేతర), ఇంట్లోని పశువులు, వృత్తి, అన్ని విధాలుగా వచ్చే ఆదాయం, కులం, ఉప కులం, మతం, విద్యార్హత, నివాసం ఉండే ఇల్లు, మంచినీటి సదుపాయం, టాయిలెట్లు, గ్యాస్ ఉందా లేదా అనే వివరాలు సేకరిస్తున్నారు.

శనగ పంటకు మేలు చేస్తున్న పొగ మంచు



చంద్రేడులో కళకళలాడుతున్న శనగ మొక్కలు

రంగంపేట: మండలంలో రైతులు సాగు చేసిన శనగ పంటకు పొగ మంచు మేలు చేస్తుంది. గత కొద్ది రోజులుగా పొగమంచు దట్టంగా కురుస్తుండటంతో శనగ మొక్కలు కళకళలాడుతున్నాయి. మంచు, చలిగాలుల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఆ వాతావరణం శనగ పంటకు కలిసొచ్చింది. సాధారణంగా శనగ సాగుకు ఒకటి, రెండు నీటి తడులుంటే సరిపోతుంది. మంచు కారణంగా మొక్కలు ఎదుగుతాయి. మండల పరిధిలోని వడిశలేరు, రంగంపేట, చంద్రేడు, పెదరాయవరం గ్రామాల్లో రైతులు ఖరీఫ్‌లో వరి, మినుము పంటలు సాగు చేశారు. అనంతరం రబీలో వరి, మినుముతో పాటు శనగ సాగు చేశారు. వ్యవసాయ శాఖ 50 శాతం రాయితీపై 55 టన్నుల శనగ విత్తనాలు పంపిణీ చేయడంతో సుమారు 1,260 ఎకరాల్లో రైతులు శనగను సాగుచేశారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండటంతో పొలాల్లోని మొక్కలు ఆశాజనకంగా కనిపిస్తున్నాయి. కొన్ని చోట్ల ముందుగా వేసిన పొలాల్లో మొక్కల నుంచి పూత కూడా వస్తోంది.

గొంతేలమ్మకు ఎమ్మెల్యే రాజా పూజలు



మధురపూడి: గాడాల గ్రామ దేవత గొంతేలమ్మ జాతర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారిని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆదివారం దర్శించుకున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు కన్నెం శ్రీనివాస్, మడికి గంగాధర్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా భారీ ఊరేగింపు నిర్వహించారు. పార్టీ నాయకులు చాటపర్తి దుర్గారావు, కొండపల్లి దుర్గారావు, శనివారపు ధనరాజ్ పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే రాజా

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సీతానగరం హైస్కూల్లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

సీతానగరం: స్థానిక ప్రభుత్వ హైస్కూల్లో 1981–82లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. స్థానికంగా ఉన్నవారితో పాటు ఇతర ప్రాంతాలలో స్థిరపడిన వారు సైతం ఈ ఆత్మీయ సమ్మేళనానికి తరలివచ్చారు. చదువుకున్న రోజుల్లో చేసిన అల్లరి, ఆనాటి జ్ఞాపకాలను తలచుకుని సందడి చేశారు. పూర్వ విద్యార్థులు గద్దె వెంకట కృష్ణ చౌదరి, సత్తిపండు రాజు, శ్రీమందపాటి అచ్చిబాబు, బైర్రాజు శ్రీనివాసరాజు తదితరులు మాట్లాడారు. ఆట పాటలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా కేరింతల కొడుతూ ఉల్లాసంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులు ఎస్ఎం రామారావు, వీరభద్రం, రామ్ ప్రసాద్, గీతా సుహాసిని తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఇళ్ల రాజ్ కుమార్, కవి రాజు, చిక్కాల దేవానంద్, కర్లపూడి భాస్కరరావు, మండ రామకృష్ణ, జొన్నలగడ్డ దేవమణి, రుక్మిణి, గారపాటి శైలజ పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- అర్హులందరికీ ఇళ్ల స్థలాలు
- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి/ రాజానగరం: ముస్లింల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. రాజానగరం మండలం హౌసింగ్ బోర్డు కాలనీలో ఆదివారం ముస్లిం, మైనార్టీల ధార్మిక బహిరంగ సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీలో అర్హత గల ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలాన్ని ఇస్తానన్నారు. అలాగే ఈద్గా ప్రహరీ నిర్మాణానికి చర్యలు చేపడతానన్నారు. కాలనీలో రూ.15 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించినట్టు తెలిపారు. నెల రోజుల్లో స్పిన్నింగ్ మిల్లు పార్కును అభివృద్ధి చేస్తానన్నారు. అన్ని మతాల సారాంశం అందరికీ మంచి చేయడమే అన్నారు. రంజాన్ మాసం మత సామరస్యానికి ప్రతీక అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల మ్యానిఫెస్టోను పవిత్ర గ్రంథంలా చూశారన్నారు. కార్యక్రమంలో బొమ్మూరు సీఐ ఉమర్, నాయకులు మెట్ల ఏసుపాదం, ఇమామ్ ముజఫర్, జఫ్రుల్లాఖాన్ పాల్గొన్నారు.

చిన్న వెంకన్నబాబు స్వామీజీకి సత్కారం



చిన్న వెంకన్నబాబును సత్కరిస్తున్న ప్రముఖులు

ప్రకాశం నగర్: ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గాడాల శ్రీమహాలక్ష్మి సమేత చిన్న వేంకటేశ్వరస్వామి పీఠాధిపతి చిన్న వెంకన్నబాబు స్వామీజీని కృతజ్ఞతాపూర్వకంగా సత్కరించారు. స్థానిక ఏకేసీ కళాశాలలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి న్యాయమూర్తి బులుసు శివశంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో భాగంగా ఇటీవల రాజమహేంద్రవరంలో భారీ ప్రదర్శన, తర్వాత మూడు రోజుల పాటు గైట్ కళాశాలలో మహాసభలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ మహాసభలు విజయవంతంలో క్రియాశీలక పాత్ర పోషించిన చిన్న వెంకన్నబాబు స్వామీజీని నిర్వాహకులు అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో ఆడిటర్ భాస్కర రామ్, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, సుమేధ వెంకటరాజు, మనగుడి– మన సేవ భారతీయ ఆధ్యాత్మిక సేవాసమితి ఉభయ రాష్ట్రాల చైర్మన్ మతాల రమేష్ పాల్గొన్నారు.

మిద్దె, పెరటి తోటల పెంపకంపై సదస్సు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం బర్మా కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఆదివారం సాయంత్రం సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్ (సీటీజీ) గ్రూపు ఆధ్వర్యంలో మిద్దెతోట – పెరటి తోట పెంపకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రూపు ప్రధాన అడ్మిన్ శ్రీనివాస హర్కారా, సరోజా మాట్లాడుతూ సిటీ ఆఫ్ టెరస్ గార్డెన్స్ గ్రూపు ద్వారా వేలమందికి మిద్దె తోటల పెంపకంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అందులో భాగంగా రాజమండ్రి గ్రూపు సమావేశం అడ్మిన్లు ఐవీవీ ప్రసాద్, యర్రా శేషకుమారి, మహమ్మద్ ఖాన్, అబ్దుల్లా ఆధ్వర్యంలో నగరపాలకసంస్థ సహకారంతో నిర్వహించామన్నారు. నగరపాలకసంస్థ డబ్ల్యూఎస్ఈ ఎస్ శాంతిరెడ్డి మిద్దెతోట–పెరటితోట పెంపకానికి నగరపాలకసంస్థ పూర్తి సహకారం అందిస్తున్నామన్నారు. నగరపాలకసంస్థ అధికారులు సైదా, సాంబశివరావు, గంగాధర్ పలు సూచనలు చేశారు.

జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలి

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



సంపరలో డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: మహిళల అభ్యున్నతికి కృషి చేస్తున్న జగనన్నకు మహిళలంతా అండగా నిలిచి మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. కైకవోలు, శహపురం, కాండ్రేగుల, సంపర, పుట్టకొండ, కుమారప్రియం, పెద్దాడ గ్రామాల్లో ఆయా సర్పంచులు సూని పట్టాభిరామన్న చౌదరి, కేవీవీ సత్యనారాయణ, అద్దంకి మాచరమ్మ, వల్లు వెంకటరమణ, డోకుబుర్ర మీనాక్షిల అధ్యక్షతన వైఎస్సార్ ఆసరా నాలుగో విడత రుణమాఫీ చెక్కుల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. శహపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు ఇచ్చిన మాట తూచా తప్పకుండా నాలుగు విడతల్లో రుణమాఫీ చేసిన గొప్ప మనసున్న నేత ముఖ్యమంత్రి జగన్ అన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా సీఎం జగన్ పలు సంస్కరణలు చేపట్టారన్నారు. అనంతరం అక్కాచెల్లెమ్మలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, వైస్ ఎంపీపీ కరెడ్ల వెంకన్నబాబు, ద్వారంపూడి వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు చండాళ్ల పార్వతి, పేపకాయల వెంకటరమణ, శ్రీరామచంద్రమూర్తి, నియోజకవర్గ సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కొటికలపూడి చినబాబు, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొల్లు పెద్దకాపు తదితరులు పాల్గొన్నారు.



సత్తెమ్మ తల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

సత్తెమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో కొలువై ఉన్న సత్తెమ్మ తల్లి అమ్మవారిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. సత్తెమ్మ తల్లి తీర్థం సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలోని వైఎస్సార్ సీపీ నాయకులు గువ్వల సత్తిరెడ్డి, తమ్మిరెడ్డి నాగ శ్రీనివాసరెడ్డి, గంగాధర్, బొబ్బిలి శివప్రసాద్, చింతపల్లి వీరబాబు, బండారు వెంకన్న, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీఐ నాగమురళికి సత్కారం

మధురపూడి: కోరుకొండ సీఐగా బాధ్యతలు చేపట్టిన అడపా నాగమురళిని వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం సత్కరించారు. పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు పసుపులేటి బుల్లియ్య నాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.



సీఐ నాగమురళిని సత్కరిస్తున్న నాయకులు

బాబా ఆలయానికి రూ.58,116 విరాళం



బాబా ఆలయానికి విరాళం అందిస్తున్న దాత కుటుంబీకులు

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురంలో ఆంధ్రా షిర్డీ సాయిబాబా ఆలయానికి అర్తమూరు గ్రామానికి చెందిన చిర్లపాపయ్యమ్మ తన భర్త నర్సిరెడ్డి జ్ఞాపకార్థం రూ.58,116 విరాళంగా ఇచ్చినట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు సబ్బెళ్ల పురుషోత్తమ రెడ్డి ఆదివారం తెలిపారు. ఈ నగదును ప్రతి గురువారం ఆలయం వద్ద నిర్వహించే అన్నసమారాధనకు ఉపయోగించాలని ఆమె కోరారన్నారు. ఈ సందర్భంగా బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించి దాతలను సత్కరించారు. కార్యక్రమంలో ఆలయం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చోరీ జరిగిన 24 గంటల్లో దొంగ అరెస్టు



స్వాధీనం చేసుకున్న ల్యాప్‌టాప్, కెమెరాతో ఎస్సై జగన్‌మోహన్‌రావు, సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్: చోరీ జరిగిన 24 గంటల్లోనే దొంగను బొమ్మూరు పోలీసులు అరెస్టు చేసి, సొత్తును స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. నెల్లూరు జిల్లా రాళ్లచిలకసంగం గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ వెల్లిబోయిన వినయ్ రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న మెట్రోలాడ్జిలో దిగాడు. ఈ నెల 26వతేదీ రాత్రి సమయంలో తన లాడ్జి రూంలోని ల్యాప్‌టాప్, సోనీ కెమెరా చోరీకి గురయ్యాయని శనివారం సాయంత్రం ఐదు గంటలకు బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై జగన్‌మోహన్‌రావు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు ఈస్ట్‌జోన్ డీఎస్పీ కిషోర్ కుమార్ పర్యవేక్షణలో బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ ఎండీ ఉమర్, ఎస్సై జగన్‌మోహన్, ఏఎస్సై కె.సత్యనారాయణ, పీసీ సురేష్ ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు కాకినాడకు చెందిన పిల్లారిశెట్టి శ్రీనివాస్‌ను అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.1,20,000 విలువైన లాప్‌టాప్, సోనీ కెమెరాను స్వాధీనం చేసుకున్నారు.

ఆదాయం అదిరింది



కంబాల చెరువు పార్కు



ఆకట్టుకుంటున్న సెల్ఫీ పాయింట్

- కంబాల చెరువు పార్కుకు సందర్శకుల తాకిడి
- రెండు నెలల్లో రూ.70 లక్షల ఆదాయం

రాజమహేంద్రవరం సిటీ: నగర సుందరీకరణ నేపథ్యంలో కంబాల చెరువు పార్కును ఆధునాతనంగా తీర్చిదిద్దారు. దీంతో పార్కుకు వచ్చే సందర్శకుల సంఖ్యతో పాటు ఆదాయం కూడా పెరిగింది. ఆధునీకరణ అనంతరం అక్టోబరు 18వ తేదీన ప్రారంభమైన కంబాల చెరువు పార్కు రెండు నెలల్లో రూ.70 లక్షల ఆదాయాన్ని ఆర్జించింది. నగరంలో ఎక్కడా లేని విధంగా చేసిన ఏర్పాట్ల కారణంగా కంబాల చెరువు పార్కును సందర్శించేందుకు రోజూ వందల మంది సందర్శకులు తరలివస్తున్నారు. ఈ పార్కు నిర్వహణను కొద్ది రోజుల పాటు నగర పాలక సంస్థ నిర్వహించింది. అనంతరం ప్రైవేటు వ్యక్తులకు అద్దె ప్రాతిపాదికన ఇచ్చారు. సాధారణ సమయాల్లో ఒక తరహా ధర, పార్కులో ఏర్పాటు చేసిన వాటర్ మ్యూజికల్ ఫౌంటైన్ పనిచేసినప్పుడు ప్రత్యేక టిక్కెట్ ధర నిర్ణయించారు. అదే తరహాలో సమయాలను కేటాయించారు. పార్కులో పలు రకాల ఆట వస్తువులను ఏర్పాటు చేశారు. స్కై సైకిల్, జిప్‌లైన్, 360 డిగ్రీ సైకిల్, హ్యూమన్ గైరో, పెడల్ బోటింగ్ తదితర వాటిని యువత, చిన్నారులకు కోసం ఏర్పాటు చేశారు.

టికెట్ వసూలులో గందరగోళం

పార్కుకు వచ్చే సందర్శకులు టిక్కెట్ కొనుగోలు చేసే సమయంలో మోసపోతున్నారు. సాయంత్రం 6 నుంచి వసూలు చేయాల్సిన ధరను 5.19 గంటల నుంచే వసూలు చేస్తున్నారని త్రిష, సంధ్య ఆవేదన వ్యక్తం చేశారు. వీరిద్దరూ గత నెల 26వ తేదీ 5.19 గంటలకు పార్కుకు వెళ్లారు. వారి నుంచి రూ.30 చొప్పున ఇద్దరికీ రూ.60 వసూలు చేయాలి. కానీ రూ.వంద తీసుకున్నారు. టికెట్ ధర విషయంతో మోసపోయామని తెలుసుకుని అధికంగా వసూలు చేసిన రూ.40 తిరిగి చెల్లించాలని ఎంత కోరినా తిరిగి ఇవ్వటానికి టికెట్ అమ్మే వ్యక్తులు ఇష్టపడలేదు. ఈ విషయాన్ని కాంట్రాక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లిన ప్రయోజనం లేకుండా పోయింది. దీనిపై నగర పాలక సంస్థ రెవెన్యూ అధికారి శ్రీనివాసరావును వివరణ కోరగా ఇలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు చేపడతామన్నారు.

పార్కు సమయాలు

రోజు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకూ పార్కు నిర్వహిస్తున్నారు. అయితే ఉదయం నుంచి సాయంత్రం 5.59 గంటల వరకూ పార్కులో ప్రవేశించే పెద్దలకు రూ.30, చిన్నారులకు రూ.20 వసూలు చేస్తున్నారు. అలాగే వాటర్ మ్యూజికల్ ఫౌంటైన్ పనిచేసే సమయం అంటే సాయంత్రం 6 నుంచి 9.30 గంటల వరకూ పెద్దలకు రూ.50, చిన్నారులకు రూ.30గా నిర్ణయించారు.